జోరుగా రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు

- మరో 3 నెలల్లో పూర్తి కానున్న పనులు
- సమస్య శాశ్వతంగా పరిష్కారమైనట్లేనంటున్న ప్రజలు



పెనుకొండ: నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి

పెనుకొండ: పట్టణంలోని రైల్వే గేటు అంటే ఎవరికైనా దడే. పది కాదు ఇరవై కాదు ఏకంగా రోజుకు 50 రైళ్లు రాత్రింబవళ్లు నడుస్తుండటంతో తరచూ రైల్వే గేటు పడుతూనే ఉంటుంది. దీంతో అటుగా వెళ్లాలంటనే ప్రయాణకులు, స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు, శాసన సభ్యులు మాలగుండ్ల శంకరనారాయణ పలుమార్లు రైల్వేశాఖ ఉన్నతాధికారులకు విన్నవించారు. స్పందించిన రైల్వే శాఖ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం పనులు చివరి దశకు చేరుకున్నారు. మరో 3 నెలల్లో పనులు పూర్తి కానున్నాయి. ఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే ఏ ఇబ్బంది లేకుండానే లారీలు, కార్లు, ద్విచక్ర వాహనాలు వెళ్లొచ్చని రైల్వే శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు కూడా జోరుగా సాగుతుండటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

15 నుంచి 20 నిమిషాల పాటు..

పెనుకొండ రైల్వేలైన్ ద్వారా ఎక్స్‌ప్రెస్‌లు, గూడ్సు రైళ్లు, ప్యాసింజర్లు రోజూ 50 దాకా వెళ్తుంటాయి. రైల్వే గేటు తరచూ పడుతుండటంతో అందరూ ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు ప్రమాదాలు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ఇక్కడి నుంచి తరలించే సమయంలో కనీసం 15 నుంచి 20 నిమిషాల పాటు గేటు మూసివేస్తుండడంతో తగిన వైద్యం అందక పలువురు ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలూ ఉన్నాయి.

3 నెలల్లో పనులు పూర్తి చేస్తాం

3 నెలల్లోగా పెనుకొండ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తి చేస్తాము. ప్రజలు, వాహన చోదకులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులు వేగవంతంగా చేస్తున్నాము. రూ.30 కోట్లతో పనులు జరుగుతున్నాయి. నాణ్యతలో కూడా రాజీ పడటం లేదు.

\- రుక్మాంగదరెడ్డి, కాంట్రాక్టర్

సమస్యకు శాశ్వత పరిష్కారం



పెనుకొండకు రావాలంటే రైల్వేగేటుతో ప్రతిరోజూ ఇబ్బందే. రైళ్ల సంఖ్యతో పాటు క్రాసింగ్‌లు పెరిగిపోవడంతో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. త్వరలో ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తి కానుండటంతో సమస్యకు శాశ్విత పరిష్కారం లభించినట్లే.

\- సత్యనారాయణ, మునిమడుగు, పెనుకొండ

జగనన్నను ఆశీర్వదించండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి

హిందూపురం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రతి లబ్ధి ప్రజలకు నేరుగా చేరేలా సేవలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను 2024లో కూడా రెండోసారి సీఎంగా ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం కిరికెర పంచాయతీ బసవనపల్లి ఇందిరమ్మకాలనీలో «మమేకం» కార్యక్రమంలో భాగంగా ప్రజలు, పార్టీ నాయకుల ఇళ్లవద్దకు వెళ్లి కలిశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామాంజి, సింగిల్‌విండో డైరెక్టర్ రంగనాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, షఫీ, రెహిమాన్, నారాయణరెడ్డి, బాబాజాన్, ప్రభాకర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, తిమ్మిరెడ్డి, లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు హౌసింగ్ పురోగతిపై సమీక్ష

గోరంట్ల: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 'పేదలందరికీ ఇళ్ల పథకం' పురోగతిపై హౌసింగ్, సచివాలయ ఉద్యోగులతో ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథగుప్తా తెలిపారు. కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. హౌసింగ్, పంచాయతీరాజ్, విద్యుత్ తదితర శాఖల అధికారులు హాజరుకావలన్నారు.

జేడీఎస్‌కు షాక్

పావగడ: స్థానిక జేడీఎస్ పార్టీ సీనియర్ నేత, ప్రముఖ న్యాయవాది భగవంతప్ప కాంగ్రెస్ పార్టీలో చేరి జేడీఎస్‌కు భారీ షాక్ ఇచ్చారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాజీ డీసీఎం పరమేశ్వర్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. భగవంతప్ప మాట్లాడుతూ త్వరలోనే దాదాపు 200 మంది జేడీఎస్ నాయకులు, కార్యకర్తలను కాంగ్రెస్‌లోకి చేర్పిస్తానన్నారు.

వైఎన్ హొసకోట పాఠశాలకు వందేళ్లు



వేడుకను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట ప్రభుత్వ మోడల్ ప్రాథమికోన్నత బాలల పాఠశాల నిర్మించి వందేళ్లు పూర్తయ్యాయి. ఇందులో భాగంగానే వందేళ్ల పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వెంకటరమణప్ప మాట్లాడుతూ వందేళ్ల వేడుక జరుపుకుంటున్న ఈ పాఠశాలలో చదవడం తన అదృష్టమన్నారు. కార్యక్రమంలో నలంద కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ శివణ్ణ, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, పాఠశాల పూర్వ విద్యార్థి లాయర్ నాగేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

22న ఉగాది కవి సమ్మేళనం

హిందూపురం టౌన్: శ్రీశోభకృత్ నామసంవత్సర ఉగాది పండుగ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 22న సాయంత్రం 5 గంటలకు కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఈటీ రామ్మూర్తి, జోనల్ అధ్యక్షుడు రామకృష్ణ సోమవారం పేర్కొన్నారు. స్థానిక ఆర్‌జీటీ రోడ్డులోని అల్ హిలాల్ పాఠశాలలో కవి సమ్మేళనం జరుగుతుందన్నారు. సామాజిక స్పృహతో కూడిన కవితలను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.

జపానంద సేవలు ఆదర్శప్రాయం

పావగడ: స్థానిక స్వామి వివేకానంద సంఘటిత గ్రామీణ ఆరోగ్య కేంద్రం వ్యవస్థాపకుడు స్వామి జపానంద సేవలు ఆదర్శనీయమని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి డా జి పరమేశ్వర్ ప్రశంసించారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా నిర్మించిన నేత్ర శస్త్ర చికిత్స భవనం, గడ్డి పంపిణీ కార్యక్రమాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంకటరమణప్ప, డా వెంకట్రామయ్య, లాయర్ భగవంతప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసిన దృశ్యం

మడకశిర రూరల్: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆర్డీటీ సంస్థ ఆర్డీ మల్లికార్జున సూచించారు. గౌడనహళ్లి జిల్లా ఉన్నత పాఠశాలకు సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న 68 విద్యార్థులకు ఆర్డీటీ ఆధ్వర్యంలో సోమవారం సైకిళ్లు పంపిణీ చేశారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షి పంచాయతీ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్మికులకు సర్పంచ్ ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర దుస్తులు పంపిణీ చేశారు. ఉగాది పండుగను పురస్కరించుకుని కార్మికులకు దుస్తులతో పాటు వంట నూనె, సబ్బులు కూడా అందజేశారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడి మృతి



సంజీవరాయప్ప (ఫైల్)

లేపాక్షి: మండల అగ్రికల్చర్ బోర్డు సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ భర్త సంజీవరాయప్ప (75) అనారోగ్యంతో సోమవారం మధ్యాహ్నం చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు అశ్వర్థనారాయణ, సర్పంచ్ నిర్మల తదితరులు సంజీవరాయప్ప భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

ఇన్‌స్పెక్టర్‌తోనే ఆస్తుల సంరక్షణ సాధ్యంకాదు

- ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం: వక్ఫ్‌బోర్డు ఆస్తుల సంరక్షణ కేవలం డీఆర్‌ఓ వక్ఫ్‌ఇన్‌స్పెక్టర్‌తోనే సాధ్యంకాదు... వక్ఫ్ ఆస్తులను కాపాడుకోవడానికి చట్టాలను ఉల్లఘించిన వారిపై జీఓ ఎంఎస్ నంబర్ 18 ప్రకారం కేసులు నమోదు చేయాలని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. సోమవారం విజయవాడ జరుగుతున్న శాసన మండలి సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల సంరక్షణ రాష్ట్రస్థాయి కమిటీని కూడా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. జీఓ ప్రకారం వక్ఫ్ ఆస్తుల రక్షణలో చట్టాలను ఉల్లఘించిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. అదేరీతిలో వక్ఫ్ ఆస్తులు డీల్ చేస్తున్న ముత్తవల్లి కూడా పబ్లిక్ సర్వెంట్స్ కిందనే వస్తారని తెలిపారు. ఎవరైనా వక్ఫ్ ఆస్తులు దుర్వినియోగం చేస్తే వారిపై కూడా ప్రివెన్షన్ ఆఫ్ కరెప్షన్ యాక్ట్ అమలు చేయవచ్చన్నారు. ఆక్రమణకు గురైన ఆస్తులను రెగ్యులరైజ్ చేసే అవకాశం ఉంటే బాగుంటుందన్నారు.

భూసేకరణ వేగవంతం చేయండి



నేమలిగుట్టలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ కార్తీక్

మడకశిరరూరల్: మండలంలో అభివృద్ధి పనులకు అవసరమయ్యే భూ సేకరణ వేగవంతం చేయాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన హైవే రోడ్డు, రైల్వేలైన్ నిర్మాణానికి సంబంధించిన భూసేకరణపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో చర్చించారు. భూములు కోల్పోతున్న రైతులతో చర్చించి మంచి పరిహారం అందిస్తామని వివరించి భూసేకరణ వేగవంతం చేయాలన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్, నేషనల్ హైవే డీఈ జగదీష్, ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాసులు నీలకంఠాపురం వద్ద హైవే రోడ్డులో ఏర్పాటు చేసిన ముఖ ద్వారాలు, రోడ్డు పనులను పరిశీలించారు. అలాగే పట్టణంలోని నేమలిగుట్టలో ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలను పరిశీలించి మార్పుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన పది ప్రశ్నపత్రాలు



ప్రశ్నపత్రాలను భద్రపరుస్తున్న అధికారులు

లేపాక్షి: వచ్చే నెల 3 నుంచి జరిగే 10వ తరగతి పరీక్షలకు సంబంధించి సెట్–1 ప్రశ్నపత్రాలు సోమవారం ఉదయం ఎంఈఓ నాగరాజుతో కలసి అధికారులు లేపాక్షి పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. లేపాక్షిలోని ఏపీ గురుకుల పాఠశాల కేంద్రానికి 200, వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రానికి 240, ఎస్ఎస్ఆర్‌జెడ్పీ ఓరియంటల్ ఉన్నత పాఠశాల కేంద్రానికి 217 ప్రశ్నపత్రాలను భద్రపరిచామని ఎంఈఓ పేర్కొన్నారు.

హోదా మరచి దాడికి దిగడం హేయం



ప్లకార్డు చూపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేలు తమ హోదా మరిచి దళిత ఎమ్మెల్యే సుధాకర్‌పై దాడి చేయడంతో పాటు స్పీకర్ విధులను నిర్వహించకుండా అడ్డుకోవడం హేయమైన చర్యని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ విమర్శించారు. వెంటనే టీడీపీ ఎమ్మెల్యేలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలోనూ చంద్రబాబు దళితులను అవహేళనగా అవమానించడం ప్రజలు మరచిపోలేదన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుయుక్తులు పన్నినా సీఎం జగన్‌కు అన్ని వర్గాల వారు అండగా ఉంటారన్నారు.

చర్యలు తీసుకోవాల్సిందే

రొద్దం: అసెంబ్లీ సమావేశాల్లో దళిత ఎమ్మెల్యేపై దాడిచేసిన టీడీపీ ఎమ్మెల్యేపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చంద్రశేఖర్ సోమవారం డిమాండ్ చేశారు. దళితులను అవమాన పరిచిన ఈరోజు బ్లాక్ డే అన్నారు. దళితులంటే చంద్రబాబుకు, టీడీపీ నేతలకు చులకనైపోయిందని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.



ఒక్క చోటకు చేరిన నేతాజీ మున్సిపల్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

హిందూపురం టౌన్: 40 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒక్క చోట చేరి తమ మధుర జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. పట్టణంలోని నేతాజీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1982–1983 సంవత్సరంలో విద్యాభ్యాసం చేసిన అప్పటి విద్యార్థులు సోమవారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి పాఠశాలలో వారికున్న జ్ఞాపకాలను, అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. నాటి ఉపాధ్యాయుడు కల్లూరు జానకీరామారావును ఘనంగా సన్మానించారు.

నేటి నుంచి రాగి జావ పంపిణీ

గుడిబండ: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం నుంచి విద్యార్థులకు రాగి జావా పంపిణీ చేయాలని ఎంఈఓ శ్రీధర్ సూచించారు. సోమవారం ఆయన మండల పరిధిలోని మండలపల్లి, ఎస్.రాయాపురం గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు.

రైతులకు న్యాయం చేయండి

పెనుకొండ: అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు సబ్‌కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. జంగాలపల్లి పెద్దన్న, హరి తదితరులు మాట్లాడుతూ అకాల వర్షంతో దాదాపుగా 100 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయన్నారు. నాయకులు రమేష్, పెద్దన్న, వజ్రం నాగప్ప పలువురు రైతులు పాల్గొన్నారు.

చిత్రలింగేశ్వరస్వామికి పూజలు



అలంకరణలో చిత్ర లింగేశ్వరస్వామి

అమరాపురం: మండలంలోని కెంచంపల్లి పొలిమేరలో వెలసిన యాదవుల కులదైవం చిత్ర లింగేశ్వరస్వామికి భక్తులు సోమవారం విశేష పూజలు చేశారు. ఫాల్గుణ మాసం చివరి సోమవారాన్ని పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి అభినందన

పరిగి: ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డునందుకున్న అరుణ్‌కుమార్‌ను ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు అభినందించారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆయన కృషిని కొనియాడారు. ఉపాధ్యాయులు అరుణ, పవన్‌కుమార్ శర్మతో పాటు ఉపాధ్యాయ బృందం అరుణ్‌ను సత్కరించారు.

జగనన్న కాలనీలో అధికారుల పర్యటన

రొళ్ల: మండల పరిధిలోని టీడీ పల్లి, రొళ్ల, హులికుంట గ్రామాల్లోని జగనన్న కాలనీలను సోమవారం జిల్లా క్వాలిటీ కంట్రోలర్ అధికారి శేషానందరెడ్డి, సహాయకుడు శివారెడ్డి తదితరులు పరిశీలించారు. ఉపాధి పథకం కింద చేసిన పనులు, బిల్లుల మంజూరు తదితరాలపై మండలాధికారులను అడిగి తెలుసుకున్నారు.

రిజర్వాయర్ కోసం సీఎంకు వినతి



సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: ఎమ్మెల్యే తిప్పేస్వామి సోమవారం అసెంబ్లీలో మరోసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. పలు అభివృద్ధి పనులను మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రధానంగా నియోజకవర్గానికి పూర్తిస్థాయిలో కృష్ణాజలాలు అందించడానికి వీలుగా ఒక రిజర్వాయర్‌ను కూడా మంజూరు చేయాలని కోరగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు.

స్పీకర్‌పై దాడి చేయడం బాధాకరం

అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేలు స్పీకర్ తమ్మినేని సీతారాంపై దాడి చేయడం చాలా బాధాకరమని ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. ఈ ఘటనపై అసెంబ్లీలో సోమవారం జరిగిన చర్చలో ఆయన మట్లాడుతూ టీడీపీ సభ్యులు స్పీకర్‌పై అత్యంత దారుణంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ వ్యవహారాలను తాను 40 ఏళ్ల నుంచి చూస్తున్నానని, ఇలాంటి దురదృష్టకరమైన సంఘటన ఎప్పుడూ జరగలేదన్నారు. స్పీకర్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శ్మశాన వాటిక ఏర్పాటు చేయండి



డీటీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలో నివాసిస్తున్న మాల కులస్తులకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని మాల కులస్తులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ వెంకటేశ్వర్లకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో దాదాపు 5 వేల మందికి పైగా మాల కులస్తులు ఉన్నారని, ఇప్పటికీ శ్మశాన వాటిక లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. మాల కులస్తులకు పట్టణంలో ఎక్కడో ఒకచోట స్థలాన్ని కేటాయించాలని విన్నవించారు. వారికి బీఎస్పీ రాష్ట్ర నాయకులు శ్రీరాములు, గ్రేటర్ రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు మద్దతు పలికారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం ఆంజనేయులు, గంగాధరప్ప, శివన్న, నందకుమార్, శివప్ప, కదిరప్ప, శంకరప్ప, నాగరాజు పాల్గొన్నారు.

మార్కెట్ ధర ప్రకారం పరిహారమివ్వాలి

చిలమత్తూరు: మండలంలో ప్రారంభమయ్యే గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం రైతుల వద్ద నుంచి సేకరిస్తున్న భూములకు ప్రైవేటు మార్కెట్ ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ హనుమంతుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు ప్రవీణ్, లక్ష్మీనారాయణ, నరసింహ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

చిలమత్తూరు: మండల కేంద్రంలోని బైరేకుంట వద్ద ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. సోమవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలో భాగంగా మ్యాథ్స్, బాటనీ, సివిక్స్ పరీక్షలు నిర్వహించారు. 243 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 235 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషా తెలిపారు.. పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్‌జేసీలో ఇంటర్ పరీక్షలు సజావుగా జరుగుతున్నాయి. సోమవారం ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థులు మొత్తం 333 మంది హాజరుకావాల్సి ఉండగా 327 మంది పరీక్ష రాసినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ఆరుగురు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

పరీక్షల తనిఖీ

అమరాపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షా కేంద్రాన్ని ఫ్లైయింగ్ స్క్వాడ్ హాజీపీరా తనిఖీ చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు సోమవారం 273 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 266 మంది హాజరయ్యారని, ఏడుగురు పరీక్షకు గైర్హాజరైనట్లు సీఎస్ మహేష్, డీఓ కృష్ణమూర్తి తెలిపారు.

25లోగా పంటనష్టం నివేదికలు అందించండి



వర్షానికి దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఏడీ స్వయంప్రభ

పెనుకొండ రూరల్: రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు సంబంధించిన నివేదికలను 25 లోగా అందించాలని సిబ్బందికి ఏడీ స్వయంప్రభ ఆదేశించారు. సోమవారం పెనుకొండ మండలంలోని దుద్దేబండ, వెంకటగిరిపాళ్యం గ్రామాలలోని నష్టపోయిన రైతుల పంటలను ఆమె పరిశీలించారు. ఆమె వెంట టో సురేంద్ర నాయక్, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



క్యాన్సర్‌పై అప్రమత్తత అవసరం



పరిగి: నోటి క్యాన్సర్‌పై జరిగిన అవగాహన కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు



హిందూపురం: ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వాస్పత్రి సిబ్బంది



సోమందేపల్లి: విద్యార్థులకు పేస్ట్, బ్రెష్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

హిందూపురం/పరిగి/రొద్దం/గోరంట్ల/సోమందేపల్లి: నోటి క్యాన్సస్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వక్తలు తెలిపారు. నోటి క్యాన్సర్ నివారణ, నోటి ఆరోగ్య సంరక్షణ దినోత్సవం సందర్భంగా సోమవారం హిందూపురం, పరిగి, రొద్దం, గోరంట్ల, సోమందేపల్లి మండలాల్లో విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ఆయా ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చాలా మంది పొగాకు ఉత్పత్తుల జోలికెళ్లి అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ప్రధానంగా క్యాన్సర్‌కు పొగాకు ఉత్పత్తుల వాడకమే కారణమన్నారు. రెండు పూటలా పళ్లను శుభ్రపరచుకోవాలన్నారు. పళ్ల సంరక్షణతో దంతక్షయాన్ని నివారించవచ్చన్నారు. ఈ సందర్భంగా క్యాన్సర్ వ్యాధి, పళ్ల సంరక్షణపై లఘు చిత్రాలను ప్రదర్శించారు.

26న వేమన విగ్రహావిష్కరణ



ఆహ్వాన పత్రికలను అందజేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మడకశిర ఆదిరెడ్డిపాళ్యం కూడలిలో 26న యోగి వేమన విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన ఆ సంఘం నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, రెడ్డి సోదరులను కలిసి యోగి వేమన విగ్రహావిష్కరణ ఆహ్వాన పత్రికలను అందజేశారు. రెడ్డి సంఘం నాయకులు నాగభూషణ్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, నరేష్‌రెడ్డి, మణికంఠరెడ్డి, శ్రీరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

